మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మజ్జివలసలో వైఎస్సార్ ఆసరా సభకు హాజరైన మహిళలు


మజ్జివలసలో రూ.6.71 కోట్ల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం మజ్జివలసలో 16 పంచాయతీలకు చెందిన 815 డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.6.71 కోట్ల చెక్కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా పక్షపాతి అయిన సీఎం జగన్ సంక్షేమ పథకాలన్నీ వారి పేరు మీదే అందజేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలకు ఇస్తామన్న రుణమాఫీ, సున్నా వడ్డీ అమలు చేయకపోడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. బ్యాంకుల నుంచి తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. వారి ఉసురు తగిలే 2019లో దారుణంగా ఓటమి చెందారన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదరికం, అవినీతి రూపుమాపి అందరి భవిష్యత్ కోసం 30 రకాల సంక్షేమ పథకాల ద్వారా రూ.4.70 లక్షల కోట్లు 1.25 లక్షల కోట్ల కుటుంబాలకు అందించారన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగేళ్లలో భీమిలి మండలంలో మహిళలకు రూ.26 కోట్లు, జిల్లాలో రూ.711 కోట్లు పంపిణీ చేశారన్నారు. భీమిలి మండలంలో 4 వేలు, నియోజకవర్గంలో 35 వేలు, జిల్లాలో 1.80 లక్షలు, రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది అక్కచెల్లమ్మలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. కరోనా, తుఫాను, భూకంపం వంటి ఏ విపత్తు వచ్చినా సంక్షేమ పథకాలు నిలపకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ వచ్చినా భీమిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, స్థానిక సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు లచ్చుబుగత జగదీశ్వరరావు, గాడు వెంకట నారాయణ, ముద్దాడ అప్పయ్యమ్మ, సమ్మిడి శ్రీనివాసరావు, మద్దిల వెంకటరమణ, తుపాకుల అప్పలస్వామి, గుడ్డాల ఎల్లయ్య, గాడు తాతినాయుడు, కరుభుక్త వెంకటరమణ, చెల్లూరి నగేష్, తుపాకుల పైడిరాజు, వెంపాడ సూరిబాబు, కొయ్య రామకృష్ణారెడ్డి, తోట ఎల్లారావు, ముద్దాడ అప్పలనాయుడు, కొల్లి కోటిరెడ్డి, పల్లా సన్యాసిరావు, బొడ్డు దుర్గారావు, చెల్లూరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళలకు ఎంతో మేలు


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా ద్వారా రుణమాఫీ చేయడంతో మహిళలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4 వార్డులకు సంబంధించి సోమవారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలోని ప్రభుత్వం మహిళలకు వడ్డీ మాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి రుణాలు మాఫీ చేశారని గుర్తు చేశారు. నాలుగు వార్డుల్లోని అర్హులకు రూ.37 కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుంటేనే పథకాలు కొనసాగుతాయని, లేకపోతే అందరూ కష్టాలపాలవడం ఖాయమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉష పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, దౌలుపల్లి ఏడుకొండలు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, నాయకులు పాల్గొన్నారు.

ఆనందంగా జీవిస్తున్నాం



మణికంఠ గ్రూప్ తరఫున వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటి వరకు రూ.72వేలు పొందాను. చేయూత ద్వారా మరో రూ.56,250, నా భర్త కొండకు వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.1.41 లక్షలు, కుమారుడు కొండకు మత్స్యకార భరోసా ద్వారా రూ.40వేలు వచ్చాయి. మనుమడు అప్పలరాజుకు విద్యాదీవెన రూ.24వేలు, మనుమరాలు పూర్ణకు అమ్మఒడి రూ.42వేల ప్రభుత్వం నుంచి పొందాము. మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. – గరికిన ధనలక్ష్మి, పెదనాగమయ్యపాలెం, భీమిలి మండలం

పూల వ్యాపారంలో పెట్టుబడి..



మాకు ఉన్న పది సెంట్ల స్థలంలో పూలసాగు చేస్తుంటాను. సీజన్ బట్టి రోజుకు రూ.200 నుంచి రూ.1000 వరకు ఆదాయం లభిస్తుంది. లక్ష్మి గ్రూప్‌లో సభ్యురాలిని. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.72 వేలు వచ్చింది. కుమారుడు లోకేష్‌కు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కలిసి రూ.49వేల వరకు వచ్చింది. అత్త అప్పలనారాయణకు చేయూత ద్వారా రూ.56,250 ఇప్పటి వరకు వచ్చింది. వీటిని పూల సాగుకోసం ఖర్చు చేస్తుంటాను. జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలి.
– తుపాకుల ఆదిలక్ష్మి,మజ్జివలస,భీమిలి మండలం

మేకలు కొనుక్కుని జీవిస్తున్నాం



నేను మథర్ థెరిసా గ్రూప్‌లో సభ్యురాలిని. నా భర్త ముత్యాలరావు కూలి పనులు చేస్తుంటాడు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి ద్వారా రూ.75వేల వరకు వచ్చాయి. కుమారుడు చక్రి ఐటీఐ చదువుతున్నాడు. కుమార్తె ప్రసన్నకు పెళ్లి చేశాము. ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ లబ్ధితో రెండు మేకలు కొన్నాను. వీటి సంతతిని పెంచి కుటుంబానికి ఆదాయం సమకూర్చుకుంటాను. జగనన్నకు ధన్యవాదాలు.
– బంటు జ్యోతి, మజ్జివలస, భీమిలి మండలం

టైలరింగ్‌తో కుటుంబానికి చేదోడు...



నా భర్త చిట్టిబాబు వ్యాన్ డ్రైవర్. నేను అంబేడ్కర్ గ్రూపులో సభ్యురాలిని. మాకు దిలీప్, శిరీష ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఇంటి పట్టా ద్వారా రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరింది. దీనిని పెట్టుబడిగా పెట్టి టైలరింగ్ చేస్తున్నాను. నెలకు రూ.3 వేలు ఆదాయం పొందుతున్నాను. సీఎం జగన్ దయతో సంతోషంగా జీవిస్తున్నాం.
– వసంత సునీత, మజ్జివలస ఎస్సీ కాలనీ, భీమిలి మండలం

'లిప్'ను విజయవంతం చేయాలి


బి.తాళ్లవలస హైస్కూల్‌లో మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ త్రినాథరావు

పద్మనాభం: పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి (లిప్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమునిపట్నం డైట్ లెక్చరర్ త్రినాథరావు సూచించారు. మండలంలోని బి.తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. లిప్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్ వరకు పాఠశాలల్లో లిప్ అమలవుతుందన్నారు. పాఠశాలలో జరిగే పరీక్షా పే చర్చను వీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంటకాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బండారు అప్పలరాజు, ఉపాధ్యాయులు ఆర్‌వీ నారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పార్కు పరిరక్షణకు తక్షణ చర్యలు


మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: ప్రభుత్వ పార్కు పరిరక్షణకు తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనక మహాలక్ష్మి పేర్కొన్నారు. మధురవాడ జోనల్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన స్పందనలో జీవీఎంసీ 8వ వార్డు షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్ వాసులు ఆమెను కలిసి పార్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొద్ది రోజుల క్రితం మేయర్ వచ్చి చర్యలు చేపట్టాలని కోరినా పరిస్థితిలో మార్పులేదని వాపోయారు. నగరంపాలెంలో కాలువలు, వీధిలైట్లు, సీసీ రోడ్లు లేవని, వాడుక నీరు రోడ్డు మీదకు వస్తోందని, చర్యలు చేపట్టాలని రమేష్‌బాబు ఫిర్యాదు చేశారు. అయితే స్పందన ప్రారంభమైన అరగంట వరకూ అధికారులు ఎవ్వరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. వివిధ శాఖల అధికారుల తీరు మారకపోవడంతో తరచూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని పలువురు అర్జీదారులు వాపోతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


పూజలు అందుకున్న అభయాంజనేయ స్వామి

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బమ్మిడి ఉమ, సూర్యనారాయణ స్వామికి నవగ్రహ పూజలు, తమలపాకల అభిషేకం, హోమం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేశారు.

మిందివానిపాలెంలో రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ పరిధిలోని మిందివానిపాలెంలో గల విశ్వనాథ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్ వైద్యశాల సిబ్బంది 33 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి మాట్లాడుతూ రక్తదానం వల్ల మరొకరికి ప్రాణదానం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.సమన్వయి, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం నేడు


బంగారమ్మ తల్లి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దసపల్లా లే అవుట్‌లో గల శ్రీ బంగారమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ప్రతినిధులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో గల ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు కెనరా బ్యాంక్ ప్రతినిధులు సోమవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. అనంతరం క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ ఎం.సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని, ఫలితంగా మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. బ్యాంక్ సిబ్బంది ఎస్.రవికుమార్, ఉపాధ్యాయురాలు రేవతి దేవి తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్లవలసలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం నేడు

పద్మనాభం: మండలంలోని నేరెళ్లవలసలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ కుమార్ తెలిపారు. నేరెళ్లవలస పంచాయతీ విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఎన్నో అవకాశాలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ముగిసిన నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు


విజేత జట్టు సభ్యులకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: క్రీడల్లో రాణించడం ద్వారా అందరికీ మంచి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వుడా మైదానంలో నాలుగు రోజులుగా జరిగిన నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతో మందికి పలు క్రీడల్లో చక్కని ప్రతిభ, నైపుణ్యం ఉన్నా గతంలో వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో అలాగే ఉండేపోవాల్సి వచ్చిందన్నారు. ఈ సమస్య గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీసి వారిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. దీనివల్ల ఎంతో మంది నైపుణ్యం వెలుగులోకి వస్తోందని, భవిష్యత్‌లో విద్య రంగంతోపాటు ఉద్యోగాల విషయంలో కూడా ఎన్నో అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పోటీల నిర్వహణకు రూ.40 లక్షలు ఖర్చయిందన్నారు. గెలుపొందిన వారు త్వరలో జరగబోయే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని కోరారు. అనంతరం విజేతలకు కప్, మెడల్స్ అందించారు. కార్యక్రమానికి ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి అధ్యక్షత వహించగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రీజినల్ అధ్యక్షుడు ముత్తంశెట్టి నందీష్, ఎంపీడీవో డాక్టర్ జానకి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డు గంటస్తంభం సమీపంలోని మార్కెట్‌లో కొత్తగా రూ.1.49 కోట్లతో కూరగాయలు, చేపల మార్కెట్‌తోపాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అవసరమైన అభివృద్ధి పనులు వెంటనే చేపడుతోందన్నారు. అందులో భాగంగానే ఇప్పుడు మార్కెట్ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. 3, 4 వార్డుల కార్పొరేటర్లు దౌలపల్లి ఏడుకొండలు, గంటా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, కదిరి ఎల్లాజీ, అక్కరమాని రామునాయుడు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, కొంద్రు రామసూరప్పుడు పాల్గొన్నారు.

నెల రోజులుగా తాగునీరు వృథా

- పాత మూలకుద్దులో కాంట్రాక్టర్ నిర్వాకం


వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దులో నెల రోజులుగా తాగునీరు వృథాగా ప్రవహిస్తోంది. చిప్పాడ నుంచి పాత మూలకుద్దు గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి ఈ నీరు చేరాల్సి ఉంది. సంక్రాంతికి ముందే ఈ పైప్‌లైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న తాగునీటి వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గ్రామీణ నీటి సరఫరా, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. పగిలిన పైప్‌లైన్ నీరు రహదారిపై నుంచి వెళ్తుండడంతో వాహనాల రాకపోకల కారణంగా స్థానికులు దారి మళ్లించారు. ఈ పైప్‌లైన్ నిర్వహణ కాంట్రాక్ట్ పనులను చేపలుప్పాడకు చెందిన టీడీపీ నాయకుడికి అప్పగించారు. ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు కూడా ఇదే కాంట్రాక్టర్ చేపట్టాడు. ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా సదరు కాంట్రాక్టర్ పూర్తిగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడం లేదని, పగిలిన పైప్‌లైన్‌కు కూడా మరమ్మతులు చేపట్టకుండా గాలికి వదిలేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జోక్యం చేసుకుని నీటి వృథాను అరికట్టడం ద్వారా తమకు తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


గిడిజాల అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు తనిఖీ చేస్తున్న గొండు సీతారామ్

ఆనందపురం : అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. మండలంలోని గిడిజాలలో ఆయన సోమవారం పర్యటించి అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోనూ ఆకస్మిక తనిఖీలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కోడి గుడ్లు బరువు, పాలు, బాలామృతం తదితర వాటి నాణ్యతను పరిశీలిస్తున్నామని వివరించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వివిధ శాఖల సిబ్బంది, అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాలతో కమిషన్ నిర్విరామంగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వివిధ వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో చైల్డ్ డవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసరు ఎం.శ్రీదేవి, ఎంఈవో పద్మావతి, అంగన్‌వాడీల సూపర్‌వైజర్ పతివాడ రత్నం తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ విజేతలకు బహుమతులు


గెలుపొందిన వారికి జ్ఞాపిక అందిస్తున్న దిలీప్‌కుమార్

భీమునిపట్నం: భీమిలిలోని పి.వి.జి.రాజు మెమోరియల్ గోల్డెన్ జూబ్లీ టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన టెన్నిస్ పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, బహుమతులు సోమవారం అందజేశారు. విన్నర్స్‌గా మైలిపల్లి షణ్ముఖరావు, గుగ్గిళ్ల సతీష్, రన్నర్స్‌గా విజ్జపు వెంకటేష్, టి.భీమారావు, మూడో స్థానంలో పి.వెంకటేష్, ఎం.మహేశ్వరరావు గెలుపొందారు. సీనియర్ న్యాయవాది పి.సుందర్ సింగ్, దంతులూరి దిలీప్‌కుమార్ జ్ఞాపికలు, బహుమతులు అందించారు. టెన్నిస్ క్లబ్ సభ్యులు, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి సభ్యులు, బీచ్ సీనియర్ సిటిజన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గేట్లు ఎత్తుకుపోతున్న దొంగలు


ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు ఎత్తుకుపోయిన గేటు

తగరపువలస: కాదేదీ దొంగతనానికి అనర్హం అంటూ చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. విలువతో సంబంధం లేకుండా ఫ్లెక్సీలు అంటించిన ఐరన్ బోర్డులు, ప్లాట్లకు రక్షణగా ఉంచిన ప్రహరీల నుంచి గేట్లు రాత్రి, పగలు తేడా లేకుండా అపహరించుకుపోతున్నారు. ఇటీవల భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎత్తుకుపోయిన ఫ్లెక్సీ బోర్డులు తగరపువలస మెయిన్ రోడ్డులోని ఒక తుక్కు దుకాణంలో కనిపించాయి. ఇప్పుడు ఈ దొంగతనాలు ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధికి కూడా వ్యాపించాయి. పెద్దిపాలెం, వెల్లంకి పరిధిలో యజమానులు తమ ప్లాట్లకు రక్షణగా ఉంచిన ప్రహరీ గేట్లు తొలగించుకుని ఎత్తుకుపోయారు. దీంతో బాధితులు ఆనందపురం పోలీసులను ఆశ్రయించారు. వీటిలో ఒక్కో గేటు తయారు చేయడానికే రూ.16 వేలు ఖర్చు అవుతుందని బాధితులు వాపోతున్నారు. దీనిపై నిఘా ఉంచాలని అక్కడి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

సన్యాసినాయుడుకు అభినందనలు


సన్యాసినాయుడును సన్మానిస్తున్న నాగవంశ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ

తగరపువలస: ఇటీవల రిపబ్లిక్ డే వేడుకల్లో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న జీవీఎంసీ ఉద్యోగి ఎర్నింటి సన్యాసినాయుడును నాగవంశ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ సోమవారం సన్మానించారు. భీమిలిలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొంది ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 'చలో విజయవాడ'

మధురవాడ: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలపై బీటీఏ ఆధ్వర్యంలో వచ్చే నెల 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు ఇందుకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రకాష్ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అంతా జయప్రదం చేయాలని కోరారు.

భీమిలి క్రాస్ రోడ్డులో అక్రమ మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం,నిందితుడితో సీఐ టీవీ తిరుపతి రావు, సిబ్బంది

ఆనందపురం : మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు సమీపంలోని చెక్ పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సోమవారం పట్టుకున్నారు. సీఐ టీవీ తిరుపతి రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలి క్రాస్ రోడ్డు సమీప చెక్ పోస్టు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గంభీరం పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన తోనంగి పాపయ్య (65)ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేయగా 18 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. పాపయ్యను అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు.

హిందీ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10, 11న జరగనున్న లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించిన ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం భీమిలిలో నిర్వహించారు. ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు వీటిని నిర్వహించారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు రాశారు. అలాగే ఫిబ్రవరి 4న కూడా ప్రీ ఫైనల్ – 2 పరీక్షలు నిర్వహించనున్నట్టు కృష్ణారావు తెలిపారు.